క్లుప్తంగా

ఘనంగా పెన్నుల పూజ



రాజేశ్వరస్వామి ఆలయంలో పెన్నుల పూజ చేస్తున్న అర్చకులు

అంబాజీపేట: మాచవరం గ్రామంలో వేంచేసి యున్న పార్వతీ రాజేశ్వర స్వామి, వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్ల ఆలయంలో శనివారం పెన్నుల పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయాల అర్చకులు మాచరి రాజా, సూరిబాబుల ఆధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం పెన్నులకు పూజ జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పెన్నులను అందజేశారు.

నేటి నుంచి మోరి అమ్మవార్ల తీర్థం



మోరిలో కొలువైన మహాలక్ష్మమ్మ

సఖినేటిపల్లి: మోరిలో కొలువైన మహాలక్ష్మమ్మ, కనక మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర తీర్థ మహోత్సవాలు ఆదివారం నుంచి 15వ తేదీ వరకూ అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవాల్లో భాగంగా 9న కనక మహాలక్ష్మమ్మ(దుర్గ)కల్యాణం, చలిమిడి, పానకాలు నివేదన, మహాలక్ష్మమ్మ అమ్మవారికి చలిమిడి, పానకాలు నివేదన చేయనున్నారు. రాత్రి మోరిపోడుకు చెందిన ఆకుల వారి కుటుంబ సభ్యులతో జాతర చేయనున్నారు. 10న కనక మహాలక్ష్మమ్మ అమ్మవారిని హంస వాహనంపై కొలువుదీర్చి నగరోత్సవం నిర్వహించనున్నారు. 11న మహాలక్ష్మమ్మ అమ్మవారి రథోత్సవం, 12న అమ్మవారికి నైవేద్యాలు, 13న మహిళా బృందాలతో సహస్ర గళ లలితా సహస్ర నామ పారాయణ, రాత్రి అమ్మవార్లకు తెప్పోత్సవం నిర్వహించనున్నారు. 15న సిరిబొమ్మ నగరోత్సవంతో ఉత్సవాలకు ముగింపు పలకనున్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ ధర్మదాయశాఖ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,58,050, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.42,361తో మొత్తం రూ.2,00,411 ఆదాయం వచ్చినటుల డీసీ అండ్ ఈఓ తెలిపారు.

పెద్దింట్లమ్మ అమ్మవారి ప్రభ ఊరేగింపు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి ప్రభ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశాలపై గత నెల 28వ తేదీ నుంచి మార్చి 28వ తేదీ వరకూ ఉత్సవాలను ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో అంతర్వేది దేవస్థానం, పోలీసు, రెవెన్యూ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్ పర్యవేక్షణలో ఎస్సై కె.దుర్గా శ్రీనివాస రావు, అంతర్వేది ఆలయ సిబ్బంది, స్థానిక ఆసాదులు అమ్మవారి ప్రభ ఊరేగింపు గ్రామ పురవీధులలో ట్రాక్టర్‌పై నిర్వహించారు. అలాగే రాత్రి గోకర్ణేశ్వరస్వామి, జలదుర్గ అమ్మవారి కల్యాణం భక్తులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఉత్సవాల నిర్వహణకు ఆలయ పరిధిలోని రెండు వర్గాల మధ్య విభేదాలు ఉండడంతో పైస్థాయి అధికారు లు ఇచ్చిన ఆదేశాలుకు అనుగుణంగా ఆయా శాఖలు సంయుక్తంగా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

మాజీ సర్పంచ్ బొరుసు వర్ధంతి

మలికిపురం: రామరాజులంక మాజీ సర్పంచ్ బొరుసు వెంకట బ్రహ్మానందం వర్ధంతి కార్యక్రమం శనివారం పంచాయతీ ఆవరణలో గ్రామ ప్రముఖులు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 18 ఏళ్ల పాటు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఉపసర్పంచ్ మేడిచర్ల గంగరాజు, దేశినీడి ఉదయ భాస్కరరావు, బొరుసు సుబ్బారావు, మేడిచర్ల సూర్య ప్రకాశరావు, ముద్దల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శేషపాన్పుపై శ్రీలక్ష్మీ సహిత విష్ణుమూర్తి



చదువుల తల్లి సరస్వతీదేవి చిత్రం



పల్లె పడుచు చిత్రం

ఆకట్టుకుంటున్న బొమ్మలు

- తయారీలో అరటిగెల గుజ్జు పేపర్ల వినియోగం
- ఆకట్టుకుంటున్న బి.దొడ్డవరం యువకుడు

మామిడికుదురు: అరటిచెట్టు గెల కాండం గుజ్జుతో తయారు చేసిన పేపరుతో అద్భుతమైన బొమ్మలు తయారు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు బి.దొడ్డవరం గ్రామానికి చెందిన యువకుడు ఆకుమర్తి ప్రసన్నకుమార్. ఈ యువకుడు తయారు చేసిన చిత్రాలు వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. పర్యావరణానికి ఏమాత్రం హాని కలిగించని విధంగా చూడ చక్కని విధంగా అతని చేతిలో అందమైన బొమ్మలు జీవం పోసుకుంటున్నాయి. చిన్నారుల కోసం రామాయణం, పంచతంత్రలోని నీతి కథలను కళ్లకు కట్టినట్లుగా చూపించే యానిమేషన్ చిత్రాలు కూడా ప్రసన్నకుమార్ తయారు చేశారు. తద్వారా పలువురి ప్రశంసలు, సన్మానాలు అందుకున్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన ప్రసన్నకుమార్‌కు చిన్నతనం నుంచి కూలీ పనులు చేస్తూ ఎంతో కష్టపడి చదువుకున్నారు. పదో తరగతి పూర్తి చేసి బొమ్మలు గీయడంలో కాకినాడలో శిక్షణ పొందారు. కుటుంబ సభ్యుల సహకారంతో ఇంటర్ పూర్తి చేసి ఫైన్ ఆర్ట్స్ కోర్సు చదివారు. అనంతరం అతను పేపర్ క్రాఫ్ట్‌పై పట్టు సాధించారు. ప్రస్తుతం కాకినాడలో ప్రైవేటు స్కూల్‌లో క్రాఫ్ట్ టీచరుగా పని చేస్తున్నారు. ఇతని చేతిలో రూపుదిద్దుకున్న వందలాది బొమ్మలు, యానిమేషన్ చిత్రాలు ప్రముఖుల ప్రశంసలు పొందాయి. పెన్సిల్‌తో బొమ్మలు గీయడం, వాటిని కట్ చేసి రంగుల పేపర్లతో అందంగా తీర్చిదిద్దడం ఇతని ప్రత్యేకత. ఏ విధమైన రసాయన రంగులు వాడకుండా సహజసిద్ధమైన రంగు పేపర్లతో బొమ్మలు తయారు చేస్తున్న తీరు అత్యద్భుతం.



దుక్కి దున్నతున్న రైతు చిత్రం

కుటుంబ సభ్యులు ప్రోత్సహించారు



నాకు చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడం ఎంటే ఎంతో ఇష్టం. నా ఇష్టానికి అనుగుణంగా మా నాన్న ఆనందరావు, అమ్మ ఆదిలక్ష్మి, అన్నయ్య రాజ్‌కుమార్, కుటుంబ సభ్యులు నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించారు. మాది ఎంతో పేద కుటుంబం మా ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రమే. కానీ నా అభిరుచికి అనుగుణంగా నా కుటుంబ సభ్యులు నాకు అడుగడుగునా ఎంతో అండగా నిలిచారు. వారి సహకారంతోనే నేను ఈ స్థాయికి చేరుకున్నారు. మంచి పేపర్ కల్చర్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందాలన్నదే నా లక్ష్యమని ఆయన చెప్పారు.

– ఆకుమర్తి ప్రసన్నకుమార్, బి.దొడ్డవరం

కూటమి నేతల అబద్ధాలను ప్రజలు గ్రహిస్తున్నారు



అంబాజీపేటలో మండల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త శ్రీనివాసరావు

అంబాజీపేట: మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కి ఎనిమిది నెలలు గడుస్తున్న కూటమి ప్రభుత్వం అబద్ధాలను ప్రజలు గ్రహిస్తున్నారని త్వరలో ఆ నాయకులను తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని జెడ్పీటీసీ, పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. అంబాజీపేట గంగలకుర్రు మలుపులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన శేఖర్ స్వగృహంలో శనివారం పార్టీ సమావేశం, మహిళా దినోత్సవం జరిగింది. సమన్వయకర్త శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రూ.14 లక్షల కోట్లు అప్పులు చేశారని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై కూటమి నేతలు అబాండాలు వేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ఏపీకి ఇప్పటివరకు రూ.వేల కోట్లు అప్పుందని ప్రకటించడం కూటమి నేతల అబద్ధాలకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 8 నెలలు గడిచినా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, అమ్మఒడి వంటి పథకాలను అందజేయలేదన్నారు. పథకాలన్నీ పచ్చ చొక్కాలకే ఇస్తున్నారని, వైఎస్సార్ సీపీ వాళ్లకు ఇవ్వద్దని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బహిరంగంగా చెప్పడం సిగ్గుచేటన్నారు. స్వార్థం లేని వారు కార్యకర్తలని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలను వినియోగించుకునేందుకు పదవులు కేటాయింపు ఉంటుందన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పదవులను పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలోనే కేటాయింపులు జరుగుతాయన్నారు. అలాగే ఈనెల 12న వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సమన్వయ కర్త శ్రీనివాసరావు కోరారు. మహిళలు తమ లక్ష్యాలు సాధించేందుకు ధైర్యంగా ముందుకు సాగినప్పుడే విజయాలు సొంతమవుతాయని కోఆర్డినేటర్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి అన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, రాష్ట్ర నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి భరత్‌భూషణ్, మందపాటి కిరణ్‌కుమార్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, సూదాబత్తుల రాము, ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంఎం శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

మామిడికుదురు: బి.దొడ్డవరం బొలిశెట్టివారిపాలెంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. కుంపట్ల వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గాడేపల్లి సీతారామశాస్త్రి, గంటి శ్రీనివాసరావు బ్రహ్మత్వంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, ప్రధాన కలశ స్థాపన, గ్రామోత్సవం, అంకురారోహణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠాపన, మూల మంత్ర హోమాలను జరిపించారు. 10వ తేదీ సోమవారం ఉదయం 9.21 గంటలకు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

మామిడికుదురు: క్యాట్ ఒలింపియాడ్‌లో మొగలికుదురు శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రథమ శ్రేణిలో 8మంది విద్యార్థులు నగదు ప్రోత్సాహకాలు గెలుచుకున్నారు. ఒక్కో విద్యార్థి రూ.వెయ్యి వంతున నగదు బహుమతులు సాధించారు. 40 మంది విద్యార్థులు ద్వితీయ శ్రేణిలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. తృతీయ శ్రేణిలో 65 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్స్ పొందారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సూదా లక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం పార్థసారథి, ఆర్ఐ రాజ్‌కుమార్, అకడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీకాంత్, జీవీఆర్, డీన్ కె.రమేష్, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలషించారు.

ఘనంగా వేంకటేశ్వరునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి

కొత్తపేట: ఆత్రేయపురంలో రూ.కోట్లతో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించి క్రమం తప్పకుండా వార్షికోత్సవం నిర్వహిస్తున్న పాతపాటి సోదరులకు వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉంటాయని మాజీ టీటీడీ చైర్మన్ కనుమూరి బాపిరాజు అన్నారు. ఆయన శనివారం ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామిని దర్శించి ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణరాజు), సోదరులు పాతపాటి నాగరాజు, పాతపాటి రామాంజనేయరాజు కుటుంబ సభ్యులను అభినందించారు. తొలుత ఆయనకు పాతపాటి సోదరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వార్ని దర్శించిన అనంతరం వేదపండితుల ఆయనను ఆశీర్వదించి శాలువా వేసి సన్మానించారు. సాయంత్రం శంకుచక్ర నామార్చన, హారతి, తీర్థప్రసాదాలను వితరణ చేశారు. అలాగే గరుడ వాహనంపై స్వామి వార్ని గ్రామంలో ప్రధాన వీధుల గుండా వైభవంగా గరుడ వాహనోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వెంకట సత్య రాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణరాజు), ఆలయ నిర్వాహకులు గోరింట వినయ్‌కుమార్‌రాజు, పాకలపాటి వెంకటరాజు, ఆలయ అర్చకులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు నిర్వహించారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాలసేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

శైవ క్షేత్రాల్లో భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: మండలంలో శైవ క్షేత్రాలు శనివారం వేకువజాము నుంచి రద్దీగా మారాయి. స్వామివారి ఆరుద్ర జన్మనక్షత్రం పురస్కరించుకుని భక్తులు శివాలయాల్లో స్వామికి బిల్వ పత్రాలతో పూజలు చేసి, నందీశ్వరుడి వద్ద దీపారాధనలు చేశారు. అంతర్వేది నీలకంఠేశ్వరస్వామి, మోరి సీతారామలింగేశ్వర స్వామి, గుడిమూల కృతకృత్య రామలింగేశ్వర స్వామి వారి ఆలయాలకు భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వీటితో పాటు టేకిశెట్టిపాలెం, అంతర్వేదిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో కూడా శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

పైపులైన్ల పరిశీలన



పోతవరంలో రహదారి మార్జిన్‌లో ఉన్న పైపు లైన్లను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్ర

పి.గన్నవరం: ముంగండ, మాచవరం మంచినీటి ప్రాజెక్టులకు వెళ్లే పైపులైన్లకు ఇబ్బంది లేకుండా పోతవరం వద్ద రహదారి అభివృద్ధి పనులు నిర్వహించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధికారులకు సూచించారు. పైపులైన్ల సమస్యను ప్రాజెక్టుల పరిధిలోని గ్రామాల సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈనేపథ్యంలో శనివారం ఆర్అండ్‌బీ డీఈఈ జి.రాజేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జె.కళ్యాణ చక్రవర్తి తదితరులు రహదారి మార్జిన్‌లో ఉన్న పైపులైన్లను పరిశీలించారు. రహదారి వెడల్పు కోసం మార్జిన్లలో ఉన్న పైపులైన్లను వెలుపలికి మార్చేందుకు అవసరమైన నిధులను మండల పరిషత్, ఆయా గ్రామ పంచాయతీల నుంచి విడుదల చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కొత్త పైపులైన్లు వేసేలోగా పాత వాటికి ఇబ్బంది లేకుండా రహదారిని ఆధునీకరించాలని ఎమ్మెల్యే గిడ్డి సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ అంతరాయం

కొత్తపేట: విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా సరఫరా చేసేందుకు వీలుగా ధవళేశ్వరంలో 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ సిద్దెల రాజబాబు తెలిపారు. కొత్తపేట సబ్ స్టేషన్ ఆవరణలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును మార్చి 10న ప్రారంభించి ఏప్రిల్ 15 వరకూ కొనసాగుతుందన్నారు.

దీని వల్ల కొద్ది రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. దీనిపై వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆర్అండ్‌బీ రోడ్డును అభివృద్ధి చేయాలి



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ ఏఈ కృష్ణంరాజు

మామిడికుదురు: పాశర్లపూడి నుంచి బి.దొడ్డవరం మీదుగా పెదపట్నంలంక వరకు అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును అభివృద్ధి చేయాలని ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య కోరారు. ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన మామిడికుదురు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. వేసవిలో తాగునీటి సరఫరా, రహదారుల ఆధునీకరణ, సీసీ రోడ్ల నిర్మాణం, హౌసింగ్ రుణాల మంజూరు, సాగునీటి సరఫరా తదితర అంశాలను సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. పాశర్లపూడి నుంచి పెదపట్నంలంక వరకు ఆర్అండ్‌బీ రోడ్డు పరిస్థితి దారుణంగా ఉందని దాన్ని ఎప్పటికి అభివృద్ధి చేస్తారంటూ జంగమయ్య, సర్పంచ్‌లు సుందరనీడి చిన్ని, చెల్లుబోయిన రామశివ సుబ్రహ్మణ్యం కోరారు. రోడ్డు అభివృద్ధి పనులు ఏప్రిల్‌లో ప్రారంభించే అవకాశం ఉందని ఏఈ సురేష్ తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో రూ.3.33 కోట్లతో 65 సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణం చేపట్టామని పీఆర్ ఏఈ కృష్ణంరాజు తెలిపారు. వీటిలో 60 రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. మిగిలినవి ప్రోగ్రెస్‌లో ఉన్నాయని చెప్పారు. వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీ తెలిపారు. శివారు ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

కర్లమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో కర్లమ్మ తల్లి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండేళ్లకోసారి నిర్వహించే జాతరను పురస్కరించుకుని అమ్మవారిని ఆలయం నుంచి గరగ రూపంలో పుట్టింటికి తీసుకువచ్చారు. గ్రామ ఇలవేల్పుగా భావించే గ్రామస్తులు శాస్త్రోక్తంగా సంప్రదాయ రీతిలో పూజలు నిర్వహించి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. సుమారు పక్షం రోజుల పాటు అమ్మవారి గ్రామంలో గరగ రూపంలో ఇంటింటికీ దర్శనమివ్వనున్నారు. అడబాల వంశస్తుల ఆడపడుచుగా, దూలం వంశం వారి కోడలుగా, యెరుబండి వంశీయుల మనవరాలిగా అమ్మవారిని కీర్తించడం ఆ గ్రామంలో ఆనవాయితీగా వస్తుంది.

వుమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా ఆలమూరు



సర్పంచ్ లావణ్యను సత్కరిస్తున్న ఎంపీడీఓ తదితరులు

ఆలమూరు: జాతీయ స్థాయి వుమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ పోటీలకు ఆలమూరు గ్రామ పంచాయతీ ఎంపికైంది. దేశ వ్యాప్తంగా వుమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ పోటీలకు 770 గ్రామ పంచాయతీలు ఎంపిక కాగా కోనసీమ జిల్లాలో ఏకైక గ్రామ పంచాయతీగా ఆలమూరు ఎంపిక కావడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆలమూరు గ్రామ పంచాయతీని గ్రామ కార్యదర్శి కె.మోక్షాంజలి, గ్రామ సచివాలయ ఉద్యోగుల సహకారంతో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అన్ని రంగాల్లోను అగ్రగామిగా, అత్యుత్తమ పంచాయతీగా తీర్చిదిద్ది జాతీయ అవార్డును కైవశం చేసుకుంటామని సర్పంచ్ నేలపూడి లావణ్య ధీమా వ్యక్తం చేశారు. శానిటరీ, డ్రైనేజీ, రహదారుల అభివృద్ధిలో గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. వుమెన్ ఫ్రెండ్లీ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఎంపీడీఓ ఎ.రాజు నేతృత్వంలో సర్పంచ్ లావణ్య, కార్యదర్శి మోక్షాంజలి, బిల్లు కలెక్టర్ కె.రమణ గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

అన్ని రంగాల్లో మహిళలు ప్రగతి సాధించాలి



మలికిపురం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ మహిళా దినోత్సవంలో గొల్లపల్లి సూర్యారావు

మామిడికుదురు/పి.గన్నవరం/ఆలమూరు/అయినవిల్లి/రాజోలు/మలికిపురం: మహిళలు అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధించాలని మామిడికుదురు ఎంపీపీ కుసుమ వనజకుమారి అభిలషించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పమహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు తిక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం పి.గన్నవరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలమూరులో విఘ్నేశ్వరస్వామి ఆలయ సమీప మైదానంలో సమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో సర్పంచ్ నేలపూడి లావణ్య, గ్రామ కార్యదర్శి కె.మోక్షాంజలి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా జరిగింది. అయినవిల్లి మండలం వీరవల్లిపాలెంలో సర్పంచ్ సలాది బుచ్చిరాజు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విలసలో సర్పంచ్ కుసుమ లిల్లీమంగేష్కర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిపారు. రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో కోర్టు మహిళా ఉద్యోగులు, మహిళా న్యాయవాదులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మలికిపురంలో రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం జాతీయ మహిళా దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన కేక్ కట్ చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో మహిళల సర్వతోముఖాభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. సమాజ అభివృద్ధి మహిళల అభివృద్ధితో ముడిపడి ఉందన్నారు. మహిళలను గౌరవించడం భారతీయ సంప్రదాయమని పేర్కొన్నారు. జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని అంబాజీపేట వైద్యాధికారి కేఎస్.శ్రీనివాస్ అన్నారు. గంగలకుర్రు ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు సీహెచ్ఓ బి.అప్పారావు అధ్యక్షతన వైద్య పరీక్షలను శనివారం చేశారు. వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ భోజనం చేసే ముందు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణంలో చలి గాలులు, మంచు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో దోమలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దోమలు నిల్వ ఉండకుండా మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంట చేసే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, వంట పాత్రలను ఎప్పటికప్పుడు వేడి నీళ్లతో శుభ్రపరచాలన్నారు. అంతకుముందు హిమోగ్లోబిన్, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంతకుముందు ఆల్బెండజోల్ మాత్రలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌టీపీ రవితేజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మెగా మెడికల్ క్యాంపు

మామిడికుదురు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శ్రీసత్యసాయి మల్టీ స్పెషాలిటీ మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామని సత్యసాయి సేవా సంస్థ శనివారం తెలిపింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ శిబిరంలో పలు విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ఉచితంగా వైద్య సేవలందిస్తారని తెలిపారు. ఉచితంగా రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు, ఎక్స్‌రే పరీక్షలు చేస్తారన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లోక్ అదాలత్‌తో చక్కటి పరిష్కారం

ఆలమూరు: కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌లు ఎంతో దోహదపడతాయని ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. వివిధ కేసులు రాజీ చేసుకునేందుకు కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌ను వినియోగించుకున్నారు. రాజీ మార్గమే రాజమార్గం అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని కేసులు పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని జడ్జి నాగేశ్వరరావు నాయక్ కోరారు. రాత్రి పొద్దుపోయే వరకూ కేసులు పరిష్కారం చేసేందుకు కక్షిదారులు కోర్టు వద్ద వేచి ఉన్నారు.

రాజోలులో..

రాజోలు: రాజీ మార్గం ద్వారా కక్షిదారులు ఇరువురికీ న్యాయం జరుగుతుందని రాజోలు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి అన్నారు. శనివారం రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా 147 కేసులను పరిష్కరించారు.

సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు ఆధ్వర్యంలో రెండు బెంచ్‌లు కేసులను పరిష్కరించారు. మొత్తం 147 కేసులకు రూ.41.80 లక్షల ఆర్థిక లావాదేవీల పరిష్కారం లభించింది. లోక్‌అదాలత్ సభ్యులు జేహెచ్ సాగర్, జి.రజిత తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి ప్రమీలారాణి